మత్తడి నిర్మించేదెప్పుడో!

- మరమ్మతులకు నోచుకోని కొత్తపల్లి చెరువు
- తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం
- పట్టించుకోని అధికారులు



నీరు లేక వెల వెలబోతున్న చెరువు

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి సాగు నీరు అందించే ఊర చెరువు మత్తడి కొట్టుకపోవడంతో నిరుపయోగంగా మారింది. చెరువు కింద 150 ఎకరాల వరకు రైతులు పంటలు సాగు చేస్తున్నారు. అయితే మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు మత్తడి కొట్టుకుపోయింది. అప్పటి నుంచి గ్రామస్తులు మత్తడిని నిర్మించాలన్నా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గండితో కష్టాలు..

ఊర చెరువు మత్తడికి గండి పడటంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. చెరువుకు ఆయువు పట్టుగా ఉండే మత్తడి లేకపోవడంతో నీటి నిల్వ ఉండే పరిస్థితి లేదు. చెరువు కింద సాగు చేస్తున్న పంట పొలాలకు నీరందక చాలా మంది ఏం చేయాలో తెలియక నానాపాట్లు పడుతున్నారు. సమీపంలోని రైతుల బోరుబావి నుంచి నీటిని సాగుకు వినియోగిస్తున్నారు. ఆయకట్టు కింద ఉన్న పొలాలను వదిలేసే పరిస్థితి నెలకొంది. కనీసం చెరువులో పూడిక తీసినా.. కొంత మేరకు నీటి నిల్వ పెరిగేది. కానీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం మత్తడి నిర్మాణానికి రూ.79 లక్షలు మంజూరు చేసింది. అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని ప్రకటిస్తున్నా.. ప్రభుత్వాలకు తమ కష్టాలు కనపడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మత్తడి నిర్మించాలని కోరుతున్నారు.

రైతులు నష్టపోతున్నారు



ఊర చెరువును నమ్ముకొని వ్యవసాయం చేస్తున్నాం. మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు రైతులకు తీరని నష్టం కలిగించే విధంగా మత్తడి కొట్టుకుపోయింది. దీంతో రెండేళ్ల నుంచి వరి పొలాలు పండటం లేదు. గ్రామంలోని రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం కొత్త మత్తడిని నిర్మించాలి. – సూరం మల్లారెడ్డి , రైతు, కొత్తపల్లి

ఆర్థికశాఖ వద్ద ఫైల్ పెండింగ్



కొత్తపల్లి గ్రామంలోని ఊర చెరువు మత్తడి నిర్మాణానికి కావాల్సిన నిధుల ఫైల్ రాష్ట్ర ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉంది. నిధులు మంజూరు కాగానే మత్తడి నిర్మాణ పనులు చేపడుతాం.
– శారద, ఇరిగేషన్ శాఖ డీఈఈ జైపూర్

రక్తపోటుపై అవగాహన

మందమర్రిరూరల్: ప్రతిఒక్కరూ రక్తపోటుపై అవగాహన కలిగి ఉండాలని సింగరేణి కళ్యాణిఖని డిస్పెన్సరీ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వర రావు అన్నారు. ఏరియాలోని జీఎం ఆఫీఆస్ ఆవరణలో ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని శుక్రవారం ఏరియా జీఎం దేవేందర్ అధ్యక్షతను నిర్వహించారు. ఆఫీస్ ఉద్యోగులకు రక్తపోటు నిర్ధారణ పరీక్షలు చేశారు. ధూమపానం, మద్యపానం, అధిక బరువు, కొల్లస్ట్రాల్ ఎక్కువగా ఉండడం, శారీరక శ్రమ లేకపోవడం, ఆహారంలో ఉప్పు ఎక్కువగా వాడడం వలన రక్తపోటుకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఏరియా ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా డీవైపీఎం మైత్రేయబంధు, మల్లేష్, ఉద్యోగులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జీఎం

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

శ్రీరాంపూర్: ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం పురస్కరించుకొని జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు, అధికారులకు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతీ రోజు ఉదయం వ్యాయామం చేయాలని, పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, కిరణ్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, అరవిందరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన..

ఇటీవల కొత్తగూడెంలో జరిగిన అధికారుల క్రీడా పోటీల్లో విజేతలు నిలిచిన క్రీడాకారులను జీఎం అభినందించారు. ఈ పోటీలలో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజయం సాధించింది. జట్టులో పాల్గొన్న శ్రీరాంపూర్ ఏరియా అధికారులను జీఎం తన చాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకే సమ్మర్ క్యాంపులు

వేమనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకే సమ్మర్‌క్యాంప్‌లు ఏర్పాటు చేశామని ఎంఈవో శ్రీధర్‌రెడ్డి అన్నారు. వేమనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. చిత్రలేఖనం, యోగా, ఆటలు, స్పోకెన్ ఇంగ్లిష్‌లాంటి శిక్షణలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. కార్యక్రమంలో కమలాకర్, అశోక్, వినోద్, లావణ్య, ఉపాధ్యాయులు అశోక్, తిరుపతి పాల్గొన్నారు.



విద్యార్థులతో వలంటీర్లు, అధికారులు

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. ఎంపీడీవో మధుసూధన్, ఎంపీవో సతీష్‌రెడ్డి క్యాంపు సందర్శించారు. సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న వాటి గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. బాలికలు నేర్చుకున్న ఎంబ్రాడరీలను పరిశీలించారు. ఎంఈవో వేణుగోపాల్, పంచాయితీ కార్యదర్శి కృష్ణమూరిపాల్గొన్నారు.

కోటపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా ఎంఈవో వెంకటేశ్వర్లు విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమంగా పశువులను తరలిస్తే చర్యలు

జన్నారం: అనుమతి లే కుండా అక్రమంగా వా హనాల్లో పశువులను తరలిస్తే చర్యలు తప్పవని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ అన్నారు. శుక్రవారం జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి అ టవీ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు అతిక్రమించి తరలించే వాహనాలు సీజ్ చేయడంతో పాటు, వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్, తదితరులు ఉన్నారు.



తనిఖీ చేస్తున్న ఏసీపీ ప్రకాశ్

దండేపల్లి: మండలంలోని గూడెం చెక్‌పోస్టు వద్ద మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ శుక్రవారం తనిఖీలు చేపట్టారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా పశువులను తరలించవద్దని సూచించారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలించినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి ఎస్సై తహసీనోద్దీన్ ఉన్నారు.

‘వన్ నేషన్ వన్ ఎలక్షన్’పై అభిప్రాయ సేకరణ

మంచిర్యాల టౌన్: వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తోనే దేశం అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుచిత్ర ఇన్ హోటల్‌లో అభిప్రాయ సేకరణ చర్చా కార్యక్రమం నిర్వహించారు. దేశంలో ఎలక్షన్‌ల పేరుతో డబ్బు వృథా అవుతుందని, పాలనలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందంటే అది మోదీ ఆలోచనా విధానమే అన్నారు. కార్యక్రమంలో దుర్గం అశోక్, తుల ఆంజనేయులు, యెగ్గన శ్రీనివాస్, ఆకుల రవీందర్, కర్రె లచ్చన్న, వ్యాపారవేత్తలు సుధాకర్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

బెల్లంపల్లి: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కె.నవీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. బకాయిలు చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారని, కానీ ఇంత వరకు నయా పైసా కూడా చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు ఎరుకల నర్సింగ్, ముడిమడుగుల శ్రీనివాస్, శ్యామ్, నవీన్ పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

తొలగిన మట్టి



మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: ‘మట్టిని తొలగించ రూ’ అనే కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద నర్సయ్య భవన్ ఎదుట జాతీయ రహదారిపై పేరుకుపోయిన మ ట్టిని సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో కారక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మంత్రి శివరామకృష్ణ పాల్గొన్నారు.

‘రైతులు మోసపోవద్దు’



అవగాహన కల్పిస్తున్న అధికారులు

భీమిని: నకిలీ పత్తి విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని వ్యవసాయాధికారి యమునా దుర్గా, ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం భీమిని మండలంలోని మల్లీడి, దుబ్బగూడెం రైతులకు ఆవగాహన కల్పించారు. గ్లెఫోసెట్ మందు వాడడం వల్ల పర్యావరణ కాలుష్యం, అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వినోద్‌కుమార్, అఫ్రోజ్, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆభరణ మహోత్సవం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిపై గల మైసమ్మ ఆలయంలో అమ్మవారికి ఆభరణ అలంకరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. అమ్మవారికి బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏజెంట్ శ్రీధర్, గని మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

తాండూర్: మండలంలోని కిష్టంపేట పరిధిలో ఎస్టీవాడలో నెలకొన్న నీటిఎద్దడి నివారణకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ సానుకూలంగా స్పందించారు. ఎస్టీవాడలో ఏర్పడిన నీటి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి కోర్ కమిటీ సభ్యులు మోమిన్‌అలీ, సాలిగామ మల్లేష్, ఇందూరి గట్టయ్య, కామిని శ్రీనివాస్ తీసుకెళ్లారు. దీంతో రెండు లక్షలతో శుక్రవారం బోరు వేయించి పంపు బిగించే పనులు చేపట్టారు. సకాలంలో స్పందించి తాగునీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

గోశాలకు పశువుల తరలింపు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై తిరుగుతున్న పశువులను శుక్రవారం మున్సిపల్ సిబ్బంది గోశాలకు తరలించారు. పశువుల సంచారం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో ఇటీవల మున్సిపల్, పోలీస్ అధికారులు పశువుల యజమానులకు నోటీసులు అందించారు. రోడ్డుపైకి పశువులు పంపితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో రోడ్డుపై సంచరిస్తున్న పశువులను పట్టుకుని గోశాలకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ గద్దెరాజు, ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.



పశువులను తరలిస్తున్న అధికారులు

25న సీపీఐ మహాసభ

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 21వ మహాసభ ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య అన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయం ఆవరణలో మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటంతో పాటు సింగరేణి కార్మికులు, కర్షకులు, మహిళలు, యువజన, విద్యార్థి సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయడం జరిగిందన్నారు. అమరులు చూపిన మార్గంలో సీపీఐ ముందుకు సాగుతుందన్నారు. కార్యకర్తలు, శ్రేణులు మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటస్వామి, బి.పూర్ణిమ, బి.లక్ష్మినారాయణ, రత్నం రాజం, బొంకూరి రాంచందర్, గుండా సరోజ, ఉపేందర్, బండారు శంకర్, శనిగారపు రాజేందర్, ఇనుముల రాజమల్లు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

కోటపల్లి: 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శుక్రవారం లింగన్నపేట, రొయ్యలపల్లి గ్రామాల్లోని ఆదివాసీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉండి కూడా చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. పోడు సాగులో ప్రతీ ఎకరానికి హక్కు పత్రాలివ్వాలని ఫారెస్టు శాఖ అధికారుల బెదిరింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మపున్నం, సమ్మక్క, భీమయ్య, చిన్నన్న, సమ్మయ్య, చంద్రన్న, శ్రావణ్, సంపత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

అక్రమ నిర్మాణం సీజ్

నెన్నెల: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇంటిని శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సర్వే నం.876లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని బిరుదు రాములు అనే వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, స్థానిక ఆర్‌ఐ సులోచన, మండల సర్వేయర్ దశరథంతో కలిసి నిర్మాణాన్ని పరిశీలించి సర్వే చేపట్టారు. ప్రభుత్వ భూమిలోనే పనులు చేపడుతున్నట్లు నిర్ధారించారు. ఇంటి నిర్మాణాన్ని సీజ్ చేసినట్లు ఆర్డీవో పేర్కొన్నారు. అక్రమ నిర్మాణం చేపడుతున్న కీసరి సాయి అనే వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఇల్లు నిర్మించిన వ్యక్తిపై కేసు..

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టిన కీసరి సాయి అనే వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ భూమి సర్వే నం.876లో అక్రమంగా ఇంటి పని చేపడుతున్నారని పేర్కొన్నారు. అది ప్రభుత్వ భూమిగా సర్వేలో తేలినప్పటికీ నిర్మాణం చేపడుతున్నారని ఆర్‌ఐ సులోచన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.



ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇల్లు

సమ్మె విజయవంతం చేయండి

కాసిపేట: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేఖ విదానాలకు నిరసనగా జూలై 9న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ కోరారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 20న రాష్ట్ర రాజధాని, జిల్లా, పరిశ్రమ కేంద్రాలు, కార్యాలయాల్లో భారీ ప్రదర్శనలు, సమీకరణాలు చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, బి.రాజేందర్, పార్వతి సురేశ్, చిప్పరి శ్రీహరి, లింగయ్య, కమలాకర్, సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

మంచిర్యాలటౌన్: జిల్లా మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలను శుక్రవారం అధికారులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్ మాట్లాడుతూ జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం అనేక చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో అర్హత గల 7 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీరామమూర్తి, ఎఫ్ఆర్‌వో ఎండీ ఫర్జానా బేగం, తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులు ఇస్తున్న అధికారులు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

బెల్లంపల్లి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి వన్‌టౌన్ పరిధిలో మసీదులు, దేవాలయంలో ఏర్పాటు చేసిన 22 సీసీ కెమెరాలను వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం వాటి పని తీరును పరిశీలించారు. నేరం జరిగితే నిందితుడిని పట్టుకునేందుకు ఎంతోగానో ఉపయోగపడుతాయన్నారు. ఒక సీసీ కెమెరాల వందమంది పోలీసులతో సమానమన్నారు. కార్యక్రమంలో మసీదు, దేవాలయాల ప్రతినిధులు, వ్యాపారుల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ రవికుమార్

భైరవుడిని దర్శించుకున్న పరిపూర్ణానందస్వామి

కోటపల్లి: పార్‌పల్లి గ్రామంలో కొలువైన భైరవస్వామిని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు రాజేశ్, రామకృష్ణ, శ్యాంసుందర్ స్వామికి స్వాగతం పలికి ఆలయ చరిత్రను వివరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. సరస్వతీ పుష్కరస్నానం ఆచరించి భైరవస్వామి ఆలయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. లింగయ్య, తిరుపతిరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



దర్శించుకున్న శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి

క్లుప్తంగా

పీఆర్‌పీని వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణిలో అధికారులకు చెల్లించాల్సిన పీఆర్‌పీని వెంటనే చెల్లించాలని సీఎంవోఏఐ నాయకులు డిమాండ్ చేశారు. ఏరియా అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల ముఖ్య నాయకులు పాల్గొని మాట్లాడారు. పీఆర్‌పీ చెల్లింపుల కోసం ఇదివరకే 24సార్లు అధికారులనరు కలిశామన్నారు. సమావేశంలో నాయకులు నరేందర్, నరసింహులు, శ్రీనివాస్, నాగవర్ధన్ నరేశ్, రవి, సంతోష్, వీరన్న పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు’



మాట్లాడుతున్న నాయకులు

జన్నారం: అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై బీజేపీ నాయకుల ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ ఎస్టీ సెల్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నందునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బీజేపీ బద్రినాయక్ అనవసరమైన ఆరోపణలు చేస్తు అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవినాయక్, జ్ఞానేశ్వర్, తిరుపతి, సోనేరావు, శేశురావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

తాండూర్: ఎన్నికల సమయంలో తాండూర్‌కు వచ్చి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, సీఐ కుమారస్వామి సన్మానించారు.

బెల్లంపల్లి తహసీల్దార్‌గా కృష్ణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి తహసీల్దార్‌గా ఎల్.కృష్ణ నియామకమయ్యారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న యు.జ్యోత్స్నను తాండూర్ తహసీల్దార్‌గా బదిలీ చేయగా ఆమె స్థానంలో బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి (డీఏవో)గా పని చేస్తున్న ఎల్.కృష్ణను నియమించారు. తాండూర్ తహసీల్దార్‌గా పని చేసిన ఇమ్రాన్‌ఖాన్‌ను ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేయగా ఆయన స్థానంలో బెల్లంపల్లి మండల తహసీల్దార్ జ్యోత్స్నను బదిలీపై పంపారు.

లక్సెట్టిపేట ఎంఈవోగా శైలజ

లక్సెట్టిపేట: మండల విద్యాధికారిగా గుండ్ల శైలజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తూ.. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కాసిపేట: మండల కేంద్రంలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాసిపేట మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఐదుగురు లబ్ధిదారులకు రూ. లక్ష 35వేలు మంజూరు కాగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. నాయకులు మైదం రమేశ్, మేడ రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్లకు పెళ్లి



చెట్లకు పెళ్లి జరిపిస్తున్న రైతు

నెన్నెల: అమ్మాయి, అబ్బాయిలకు హిందు సాంప్రదాయంగా ఎలా పెళ్లి చేస్తారో మామిడిచెట్లకు కూడా శుక్రవారం మండలంలోని జోగాపూర్‌లో వివాహం జరిపించారు. పురోహితుడి వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. జోగాపూర్‌కు చెందిన నికాడి శ్రీనివాస్–జయ దంపతులు వారి మామిడి తోటలో చెట్లకు లగ్గం జరిపించారు. పెళ్లికి వచ్చిన అతిథులు చెట్లపై అక్షింతలు చల్లి మురిసిపోయారు. ఆడపడుచులకు చీరలు పెట్టారు. అనంతరం సత్యనారాయణ వ్రతాన్ని జరిపించి బంధుమిత్రులకు భోజనాలు వడ్డించారు. మొదటిసారి కాయలు కోతకు వచ్చినప్పుడు ఇలా పెళ్లి జరిపిస్తే ఏటా బాగా దిగుబడి వస్తుందని నమ్మకం.